# వృద్ధులను ప్రేమిద్దాం!, లాలిద్దాం!!



ఒకప్పుడెలా ఉండేదీ....
ఉమ్మడి కుటుంబాలుండేవి.... అన్నదమ్ములు కలసిమెలసి ఉండేవారు.. తల్లిదండ్రులు కుటుంబపెద్దలుగా ఉంటూ సలహాలు, సూచనలు ఇచ్చేవారు. అవసరమైతే కీలక విషయాల్లో ఆదేశించేవారు. దానిని మిగిలిన వాళ్ళు తు.చ. తప్పకుండా పాటించేవారు. అంతే తప్ప తప్పుపట్టడమనేది ఉండదు.

తర్వాత..
కుటుంబాలు చిన్నవైపోయాయి. ఒకప్పుడు అయిదారుగురు సంతానముండె కుటుంబాలు ఇద్దరికి కుంచించుకుపోయాయి. పెద్దవాళ్ళైన తల్లితండ్రులు తమ సంతానంలో ఎవరో ఒకరిదగ్గర రోజులు గడుపుకునే రోజులొచ్చాయి. అన్నదమ్ములు తల్లిదండ్రులను వాటాలు వేసుకున్నట్టు పంచుకుని చూసిన వైనంపై కథలొచ్చిందీనేపథ్యంలోనే...
ఆ రోజులూ పోయాయి.

సంపాదన కోసం భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్న రోజులొచ్చాయి. ఆ క్రమంలోనే ఇంటిదగ్గర పిల్లలను సాకె ఆయాగా తల్లి, నౌకరుగా తండ్రి మారిపోయినట్టున్న నాటికలూ చూశాం. కథలు చదివాం.

ఇదంతా పరిణామక్రమంలో జరిగిన మార్పులు. ఆప్యాయత స్థానే స్వార్థం చోటుచేసుకుంటున్నప్పుడు పిల్లలు తమను ప్రేమగా చూస్తున్నారా లేక వారి అవసరాలకు వాడుకుంటున్నారా అని తల్లిదండ్రులూ ఆలోచించడం ప్రారంభించారు. ఎంతోసేపు ఆలోచించకముందే సమాధానం తట్టింది. ఇప్పుడు పిల్లలు తమను ప్రేమించడంలేదు. వారి అవసరాలకు ఉపయోగపడే మనుషులుగానే మనను చూసుకుంటున్నారనే.

భారతీయ సంప్రదాయ నేపథ్యంలో పైన చెప్పినది జరుగుతోంది. పాశ్చాత్య జీవన శైలిని చూస్తే.. కుటుంబంలోని వారే ,పెద్దవారిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందికి గురిచేయడం ఇంకా పెద్దఎత్తున జరుగుతోంది. దీనిని నిరో ధించేందుకు ఏర్పడింది.

International Network for the Prevention of Elder Abuse.
ఈ నేపథ్యంలోనే జూన్ 15వ తేదీని World Prevention of Elder Abuse awareness dayగా గుర్తించింది.

వృద్ధులను వేదనకు గురిచేసే పనులన్నీ ఆపేసేలా చూడడం ఈ రోజును ఏర్పాటుచేసుకోవడం వెనుక ఉద్దేశం. అసలు వేదనకు గురిచేసే పనులేమిటీ అంటే.. ఆ నిర్వచనం ఇలా ఉంది. పెద్దలను నిర్లక్ష్యంచేయడం, శారీరకంగా, ఆర్థికంగా, లైంగికంగా, మానసికంగా ఇలా ఏ రకంగా ఎవరు వేధించినా అది వారిని వేదనకు గురిచేసే పనిగానె గుర్తించాలి. మన ఇంటిలో, కార్యాలయంలో, వైద్యశాలలు, వృద్ధాశ్రమాలు ఇలా ఎక్కడైనా ఎవరైనా వృద్ధులను తమ స్వార్థానికి వాడుకునే పనులన్నీ మానుకోవాలని ఈ రోజు మనకు సూచిస్తుంది. కుటుంబ సభ్యులలో ఎవరిపట్ల ఈ వి ధంగా ప్రవర్తించినా, లేదా ఇరుగుపొరుగువారితో ప్రవర్తించినా ఇదంతా వారిని 'వాడుకోవడమే!'

భారతీయ సమాజంలో ఇప్పటికే తల్లిదండ్రుల మీద 'నిజమైన' ప్రేమ చూపిస్తున్న వారు తగ్గిపోతున్నారు. అందుకె

ముందు ముందు ఇక్కడ కూడా ఇటువంటి 'రోజు'లకు ప్రాధాన్యం పెరుగుతుందేమో! అదే జరిగితే మన సంస్కృతిని మనం మర్చిపోతున్నట్టే! అటువంటి దుర్దినాలు మనకు రాకూడని కోరుకుందాం!